క్లుప్తంగా

జలక్రీడల శిక్షణా కేంద్రం వినియోగంలోకి తేవాలి

అవనిగడ్డ: నాగాయలంకకు మంజూరు చేసిన జల క్రీడల శిక్షణ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కోరారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో బుద్ధ ప్రసాద్ రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హాయంలో నాగాయలంకలో కృష్ణానది బ్యాక్ వాటర్ జల క్రీడలకు అనువుగా ఉన్న అంశాన్ని గుర్తించి జల క్రీడల శిక్షణ కేంద్రాన్ని మంజూరు చేసి భవనాలను సైతం నిర్మించారని తెలిపారు. ఈ జలక్రీడల శిక్షణ కేంద్రం పరిస్థితిని ఇటీవల కృష్ణాజిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్స్ నుంచి రూ.2 కోట్లు నిధులు కేటాయించారని తెలిపారు. ఈ కేంద్రం పై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి భవనాలు పూర్తి చేయించి జలక్రీడల శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించాలని బుద్ధ ప్రసాద్ కోరారు.

ఎంఎల్‌హెచ్‌పీకి గాయాలు



పెడన: మండల పరిధిలోని చోడవరం ఎంఎల్‌హెచ్‌పీగా విధులు నిర్వహిస్తున్న ఎం.సుజాత స్కూటీపై రోజూ విధులకు హాజరవుతుంది. ఈ నేపథ్యంలో బుధవారం నడుపూరు దాటిన తరువాత నడిరోడ్డుపై పైపు వద్ద కుంగిఉండటంతో స్కూటీపై వెళ్తూ అదుపుతప్పి కిందపడిపోయింది. దీంతో పక్కనే ఉన్న సహచరులు, స్థానికులు ఆమెకు సపర్యలు చేశారు. అనంతరం 108లో మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎడమ కాలుకు, చేతులకు దెబ్బలు బాగా తగలగా కాలు విరిగినట్లుగా సమాచారం.

రేపు బ్రాహ్మణ కార్తిక వనసమారాధన

మచిలీపట్నంటౌన్: ఈ నెల 24వ తేదీ ఆదివారం స్థానిక గొడుగుపేటలోని శంకరమఠంలో బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. శుక్రవారం స్థానిక సిడింబి అగ్రహారంలో బ్రాహ్మణుల కార్తిక సమారాధన కరపత్రాలను సంఘ నాయకులు ఆవిష్కరించారు. బ్రాహ్మణ బంధువులు అందరూ వన సమారాధనకు హాజరై విజయవంతం చేయాలని బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు వేమూరి రామకృష్ణారావు కోరారు. ఆ రోజు ఉదయం ఏడు గంటలకు కార్తిక దామోదర పూజతో కార్యక్రమం ప్రారంభమై, పిల్లల ఆటపాటలు, మహిళలతో ముగ్గుల ప్రదర్శన, బ్రాహ్మణుల సమస్యలపై చర్చించి ప్రభుత్వానికి తెలియజేసే విధంగా సభా కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం ఉపాధ్యక్షుడు ఏఆర్‌కె.మూర్తి, బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు ఎం.సుబ్రహ్మణ్యం, వీఎస్ఎస్ఆర్.శర్మ, పీవీ ఫణి కుమార్, కాశీపట్నపు రఘుశర్మ తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రానికి ఉపకరణాల పంపిణీ



అవనిగడ్డ: భవిత కేంద్రంలోని విద్యార్థులకు సత్యసాయి సేవాసమితి నిర్వాహకులు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎంఈవో ఎస్.శివశంకరరావు అన్నారు. శ్రీ సత్యసాయి బాబా 99వ జయంతి సందర్భంగా అవనిగడ్డ భవిత కేంద్రంలో శిక్షణ పొందుతున్న ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులకు అవనిగడ్డ సత్యసాయి సేవాసమితి నిర్వాహకులు సనకా నాద మునేశ్వరరావు, మానేపల్లి ఋషీలు ఆట వస్తువులు, ఉపకరణాలను ఎంఈవో శివశంకరరావు చేతుల మీదుగా శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా నాద మునేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఏటా భవిత కేంద్రానికి సత్యసాయి సేవాసమితి ద్వారా సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం ఐఈఆర్టీలు నాగదుర్గ, నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

'కృష్ణా డెల్టా రైతులకు అన్యాయం'

అవనిగడ్డ: కృష్ణా డెల్టా రైతులకు రెండో పంటకు సాగునీరు ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం రైతులకు తీవ్ర అన్యాయం చేసిందని వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలకుర్తి రమేష్ విమర్శించారు. అవనిగడ్డలో స్థానిక విలేకరులతో శుక్రవారం రమేష్ మాట్లాడారు. అవనిగడ్డ నియోజకవర్గ రైతులు రెండో పంట సాగు చేయలేకపోతే తీవ్రంగా నష్టపోతారన్నారు. గతంలో దాళ్వా పంట లేనప్పటికీ, పంట కాలువకు ఫిబ్రవరి నెల వరకు నీళ్ల వస్తూనే ఉండేవని, కేవలం మార్చి నెలలో నీరు ఇస్తే నియోజకవర్గంలో చాలా ప్రాంతాల్లో రెండో పంట సాగు చేసుకోవచ్చన్నారు. రైతు సంఘాల అంచనా ప్రకారం కేవలం కృష్ణాడెల్టా దాళ్వాకు నాలుగు టీఎంసీల నీరు మాత్రమే సరిపోతుందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బీరాలు పలికి, అధికారం వచ్చాక రైతుల ఆకాంక్షను పట్టించుకోని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, నాయకుల మెతక వైఖరిని అవనిగడ్డ నియోజకవర్గ రైతులు గమనిస్తున్నారని రమేష్ గుర్తు చేశారు.

నట్టల నివారణతోనే మూగ జీవాలకు రక్షణ

- మండలంలో మూగ జీవాలకు టీకాలు
- గ్రామాల్లో అధికారుల పర్యవేక్షణ



బందరు గోపువానిపాలెంలో గొర్రెలకు నట్టల మందు వేస్తున్న పశుసంవర్ధకశాఖ అధికారులు

కోనేరుసెంటర్:మూగజీవాల రక్షణకు అధికారులు చర్యలు చేపట్టారు. సీజనల్‌గా వ్యాపించే వ్యాధుల నుంచి జీవాలను కాపాడేందుకు గ్రామ గ్రామాన కార్యక్రమాలు చేపడుతున్నారు. ముఖ్యంగా జీవాలకు ప్రాణహాని చేసే నట్టల వ్యాధి నుంచి వాటిని కాపాడేందుకు అవసరమైన మందులను పంపిణీ చేస్తున్నారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన నట్టల నివారణ కార్యక్రమం ద్వారా మూగ జీవాలకు ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్తలు చేపడుతున్నారు. మండలంలోని గ్రామ సచివాలయాల్లోని సిబ్బందితో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు (టీకాలు) వేయిస్తున్నారు. ఈ కార్యక్రమానికి సచివాలయ సిబ్బందితో పాటు పశుసంవర్ధకశాఖ అధికారులు సైతం హాజరై పశు పోషకులకు అవసరమైన సలహాలు, సూచనలు అందజేస్తున్నారు.

వ్యాధి లక్షణాలు ఇవే....

సహజంగా గొర్రెలు నేలపై మేతను తింటాయి. మేకలు చెట్లపై ఉన్న ఆకులు, అలములను తింటాయి. అయితే గొర్రెలు నేలపై ఆహారాన్ని తీసుకునే సమయంలో వాటి పేడ ద్వారా నేలపై పడే అంతరపరాన్న గుడ్లను తిరిగి నేలపై ఉండే గడ్డి ద్వారా మరలా భుజిస్తాయి. అలా భుజించిన ఆహారం గొర్రెల కడుపులోకి వెళ్లిన అనంతరం నట్టలు గొర్రెలకు అందాల్సిన పోషకాలను ఉపయోగించుకోవటం వలన జీవాలు బలహీనపడతాయి. అలాగే కొన్ని అంతరపరాన్న జీవులు జీవాల శరీరం నుంచి రక్తాన్నీ పీల్చేసుకోవటంతో వాటికి రక్తహీనత ఏర్పడి మరింత బలహీనపడిపోతాయి. దీంతో గొర్రెల్లో బలహీత ఏర్పడి రోగనిరోధకశక్తి తగ్గి నట్టల వ్యాధితో పాటు అనేక రుగ్మతలకు గురవుతాయి. మేకలు సైతం గొర్రెలతో కలిసి ఆహారం తీసుకునే సమయంలో ఈ వ్యాధి బారినపడి రోగ నిరోధకశక్తిని కోల్పోతాయి. దీంతో గొర్రెలు, మేకలు నట్టలబారిన పడి మృత్యువాతపడే ప్రమాదం ఉంటుంది.

పరీక్షలు తప్పనిసరి....

గొర్రెలు, మేకలలో ఈ వ్యాధి లక్షణాలు కనపడితే తక్షణమే సంబంధిత అధికారులను కలిసి జీవాలకు అవసరమైన పరీక్షలు చేయించాలి. పశుసంవర్ధకశాఖ అధికారులు సూచించిన మందులను వినియోగించాలి. అలాగే గొర్రెలు, మేకలు అనుమానాస్పదంగా మృత్యువాతపడితే, చనిపోయిన జీవాలకు మరలా వైద్య పరీక్షలు చేయించి ఆ వ్యాధి కారణంగా చనిపోయినట్లు తెలిస్తే మిగిలిన మందలోని జీవాలకు ఈ వ్యాధి సోకకుండా ఖచ్చితంగా అవసరమైన చర్యలు తీసుకోవాలి. అలా యేడాదిలో కనీసం రెండు పర్యాయాలు అయినా జీవాలకు అవసమైన టీకాలు వేయిస్తే మందను కాపాడుకునేందుకు ఆస్కారం ఉంటుందని పశుసంవర్ధకశాఖ అధికారులు చెబుతున్నారు.

జాగ్రత్తలు అవసరం.....

అధికారుల సూచనల మేరకు జీవాలకు అవసరమైన మోతాదులో మాత్రమే మందులను వాడాలి. జీవాల వయసును బట్టి తగిన మోతాదులో మందు వాడాల్సి ఉంటుంది. సరైన మోతాదులో మందు వాడకుంటే ఉపయోగం ఉండదని ఖరాఖండిగా చెబుతున్నారు అధికారులు. అలాగని అవసరానికి మించి మోతాదులో మందులను వాడినా జీవాలకు ఇబ్బందులు తప్పవంటున్నారు. అలాగే జీవాలకు మందు వినియోగించే రోజు కంటే ముందు రోజున ప్రతి రోజు అందించే మేత కంటే తక్కువ వేయాలి. మందు తాగించిన ప్రదేశంలో జీవాలు మేత మేయకుండా ఇతర ప్రదేశాలకు తీసుకువెళ్లి మేపుకోవాలి. అలా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ జీవాలను కాపాడుకోవాలని సూచిస్తున్నారు అధికారులు. మండలంలో సుమారు 35,000 గొర్రెలు, 5,000 వరకు మేకలు ఉండగా అక్టోబరు 16 నుంచి మండలంలో ఉన్న అన్ని జీవాలకు నట్టల మందు అందజేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

టీకాలు వేయటం శ్రేయస్కరం



గొర్రెలు, మేకలు నట్టల వ్యాధిబారినపడితే చనిపోయే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలి. పశుపోషకులు సొంత వైద్యాన్ని మానుకుని తాము సూచించిన సలహాలు, సూచనలు పాటిస్తే జీవాలకు మేలు జరుగుతుంది. నట్టల నివారణ మందు వేయటం వలన జీవాలు పూర్తి ఆరోగ్యంగా ఉంటాయి.

–జేడీ రమణయ్య, పశుసంవర్ధకశాఖ ఏడీ

సబ్సిడీ మినుము విత్తనాల పంపిణీ



మినుము విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, ఏవో మురళీ కృష్ణ

ఘంటసాల: సబ్సిడీపై వ్యవసాయ శాఖ అందిస్తున్న మినుము విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మ అన్నారు. ఘంటసాల రైతు సేవా కేంద్రం వద్ద సబ్సిడీపై మినుము విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఎంఏవో కె.మురళీకృష్ణ మాట్లాడుతూ మినుము విత్తనాల పూర్తి ధర ఒక కేజీ రూ.140 కాగా 30 శాతం రాయితీపై కేజీ రూ.98 చొప్పున ఒక రైతుకు గరిష్ఠంగా ఐదు ఎకరాల వరకు అందిస్తున్నట్లు చెప్పారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆయా రైతు సేవా కేంద్రాలలోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం నకలును సమర్పించాలని తెలిపారు.

మండలానికి 195 క్వింటాళ్ల మినుము విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు ఏవో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అయినపూడి భాను ప్రకాష్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ బండి పరాత్పరరావు, అయినపూడి కోటయ్య, వీఏఏలు శ్రీనివాసరావు, రేవతి, రైతులు పాల్గొన్నారు.

కోటి కార్తిక దీపకాంతులతో మెరిసిన కృష్ణమ్మ



నవహారతులను తిలకిస్తున్న భక్తజనం

నాగాయలంక: స్థానిక కృష్ణానది తీరంలోని శ్రీరామ పాదక్షేత్రం పుష్కరఘాట్ వద్ద శుక్రవారం రాత్రి శ్రీరామ పాదక్షేత్రం కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో కోటి కార్తిక దీపోత్సవం వైభవంగా జరిగింది. కార్తిక ఉపవాస దీక్షలో ఉన్న మహిళలు ఉదయం నుంచే రంగ వల్లులను తీర్చిదిద్దారు. నాగాయలంక పరిసర గ్రామాలు మర్రిపాలెం, రేమాలవారిపాలెం, వక్కపట్లవారిపాలెం, నంగేగడ్డ తదితర గ్రామాల నుంచి మహిళలు, భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి కార్తిక జ్యోతులు వెలిగించారు. కార్తిక దీపాలను థర్మోకోల్ ప్లేట్‌లలో పెట్టి కృష్ణానదిలో సాగనంపారు. శ్రీరామలింగేశ్వరునికి అర్చకులు అంబా సాయికిరణ్ శర్మ, ముదునూరి శ్రీనివాసశాస్త్రి, అచ్యుత్, నరసింహశాస్త్రి తదితర పండితులు దీపోత్సవ ప్రత్యేక పూజలు, నవహారతులు జరిపారు. తొలుత ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, సతీమణి విజయలక్ష్మి, తనయుడు మండలి వెంకట్రామ్ కోటి వత్తుల దీప స్తూపానికి ప్రజ్వలన చేశారు. క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, క్షేత్ర పాలకుడు తలశిల రఘుశేఖర్, ఉప్పల లీలాకృష్ణప్రసాద్, బోయపాటి రాము తదితరులు పర్యవేక్షించారు. మహిళలు, వివిధ సంస్థల సేవా కార్యకర్తలు, గ్రామాభివృద్ధి కమిటీ ప్రముఖులు, కమిటీ సభ్యులు ఆధ్యాత్మిక సేవలు అందించారు.



కోటి వత్తుల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ సతీమణి విజయలక్ష్మి, తదితరులు

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన

కోడూరు: కార్తికమాసాన్ని పురస్కరించుకొని మండలంలోని మాచవరం గ్రామంలో వేంచేసియున్న బాలాత్రిపుర సుందరీ సమేత రామేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రామేశ్వరస్వామి మూలమూర్తికి పంచామృతాభిషేకాలను కనులపండువగా జరిపారు. బాలాత్రిపుర సుందరీ అమ్మవారికి మహిళలచే సామూహిక కుంకుమార్చన భక్తిప్రపత్తులతో నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 250 మంది మహిళలు ఈ కుంకుమార్చనలో పాల్గొని భక్తిభావం చాటుకున్నారు. పది మంది పండితులు మంత్రోచ్ఛరణల నడుమ కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారికి చేసిన అలంకారం విశేషంగా ఆకట్టుకుంది. పూజలనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకిలో ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో నాలుగు వేల మందికి అన్నసమారాధన చేశారు. గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ పూజల్లో పాల్గొన్నారు. గ్రామపెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కనులపండువగా కార్తిక దీపోత్సవం

కోడూరు: స్థానిక షిర్డిసాయి దివ్య ధ్యానజ్ఞాన మందిరంలో కార్తిక దీపోత్సవాన్ని శుక్రవారం కనులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో లింగాకారుడు, నందీశ్వరుడు, ఓంకారం, స్వస్తిక్ ఆకృతుల్లో రంగవల్లులను అందంగా తీర్చిద్దారు. సాయినాథునికి, పరమశివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణమంతా మహిళలు కార్తికదీపాలు వెలిగించారు. సాయిబాబాకు సహస్రదీపాలకరణ సేవను నిర్వహించారు.

అన్నసమారాదన

బంటుమిల్లి: స్థానిక కనకదుర్గ నగర్‌లో శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం అన్న సమారాధన నిర్వహించారు. దసరా నవరాత్రుల ముగింపు అనంతరం జరగాల్సిన సమారాధన వాతావరణ ప్రతికూల పరిస్థితుల్లో వాయిదా పడింది. దీంతో కార్తికమాసం సందర్భంగా సమారాధనలో బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. ఆలయ ట్రస్టీ గరికపాటి కూనారావు పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు.

రేపు ఉచిత వైద్య శిబిరం



ఉచిత మెగా వైద్య శిబిరం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: విజయవాడకు చెందిన విబో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఈ నెల 24న స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో నిర్వహించే ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ టి.విశ్వనాథ్ కోరారు. ఐఎంఏ హాల్లో శుక్రవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. 6 వేలకు పైగా సర్జరీల అనుభవంతో విజయవాడలో అత్యాధునిక వసతులతో విబో హాస్పటల్ పేద, మధ్యతరగతి వారి కోసం తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో బోధకాలు, థైరాయిడ్, మొలలు, పులిపిర్లు, సోరియాసిస్, హెర్నియా, పాత గాయాల వలన ఏర్పడిన మచ్చలు, సాగిన చెవి రంధ్రాలు, తెగిన చేతి లేదా కాలి వేళ్లను తిరిగి అమర్చుట, గోరుచుట్టు, కొవ్వు గడ్డలు, చర్మ సౌందర్యం, ముఖసౌందర్యం, మానని గాయాలు, అధిక బరువు, బట్టతల, జుట్టుకు సంబంధించిన సమస్యలతో బాధపడే వారికి ఉచిత వైద్య సలహాలు, మందులు అందిస్తామన్నారు. వైద్య శిబిరం కరపత్రాలను ఆవిష్కరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, పీవీ ఫణి కుమార్, విబో హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ బి.వెంకట్రావు, మేనేజర్ ఎస్.శివరాంకుమార్ పాల్గొన్నారు.

ఎడ్లంక కాజ్ వే పనులు ప్రారంభం



ఎడ్లంక కృష్ణానదిలో కాజ్ వే పనులు ప్రారంభిస్తున్న ఎన్నారై గోవర్ధన్

అవనిగడ్డ: ఇటీవల కృష్ణానది వరదలకు ఎడ్లంక కాజ్ వే కొట్టుకుపోగా దాని పునఃనిర్మాణ పనులను ఎన్నారై బొబ్బా గోవర్ధన్ శుక్రవారం ప్రారంభించారు. వరదలకు కాజ్ వే కొట్టుకుపోవడంతో గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను గురువారం ప్రత్యక్షంగా చూసిన గోవర్ధన్ వెంటనే పొక్లయిన్ రప్పించి కాజ్ వే పనులను టీడీపీ నేతలు యాసం చిట్టి బాబు, కొల్లూరి వెంకటేశ్వరరావులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ ఇక్కడ వంతెన నిర్మించాల్సిన ఆవశ్యకత ఎంతైన ఉందని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ప్రస్తుతం గ్రామస్తులు ఇబ్బంది పడకుండా సొంత ఖర్చులతో కాజ్ వే నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్రా సుధాకర్, కనగాల సత్యం బాబు, కొల్లూరి వాసు, ఇమ్మానియేలు, మేడికొండ విజయ్, ఒడుగు రవి, మాజీ సర్పంచ్ పీతా వెంకటేశ్వరరావు, చెక్క సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్లను ఛిద్రం చేస్తున్న దమ్ము చక్రాల ట్రాక్టర్లు



నందిగామ రోడ్డులో దమ్ముచక్రాలతో వెళుతున్న ట్రాక్టర్

పెడన: దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు రోడ్లుపైకి వచ్చేస్తున్నాయి. దీంతో ఎక్కువ కాలం ఉండాల్సిన రోడ్లు కాస్తా దెబ్బతింటున్నాయి. ఆర్‌అండ్‌బీ రోడ్లతో పాటు పంచాయతీ రోడ్లు, అంతర్గత రోడ్ల మీద దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు హల్‌చల్ చేస్తున్నాయి. వాస్తవంగా గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువగా ఈ సమస్య ఉత్పన్నమవుతుందనే వాదన కూడా ఉంది. దమ్ముచక్రాలను పొలాల్లోనే బిగించుకోవాల్సి ఉంది. కానీ అలా ఎవరూ చేయటం లేదు.

ఇలా చేయాల్సి ఉంది..

ట్రాక్టరు యాజమానులకు ముందస్తుగా నోటీసులు జారీ చేయాలి. దమ్ము చక్రాలతో రోడ్డుపైకి వస్తే అపరాధ రుసుం కట్టాల్సి ఉంటుందని గ్రామాల్లో టాం టాం వేయించాలి. ఆ తరువాత పంచాయతీ కార్యదర్శి ఏ గ్రామంలో తిరిగితే ఆ గ్రామ కార్యదర్శి పట్టుకుని మండల తహసీల్దారు కార్యాలయానికి లేదా ఆ ప్రాంత వీఆర్వోలకు అప్పగించాల్సి ఉంటుంది. తహసీల్దారు రూ.2 వేలు ఫైన్ వేసే అవకాశాలున్నాయి. ఈ విధమైన కట్టుదిట్టంగా చర్యలు తీసుకుంటేనే రోడ్లు ఎక్కువ కాలం మన్నుతాయని, లేదంటే ఇటువంటి దమ్ము చక్రాలతో త్వరితగతిన రోడ్లు దెబ్బతింటాయని నిపుణులంటున్నారు.

దాళ్వా సాగుకు నీరివ్వాలని వినతి

బంటుమిల్లి: స్థానిక ప్రధాన కాలువ పరిధిలోని చౌడు భూములకు రెండో పంట దాళ్వాకు సాగు నీరిచ్చి ఆదుకోవాలని పలు గ్రామాల రైతులు శుక్రవారం తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రైతు నాయకులు మాట్లాడుతూ గతంలో రిజర్వాయర్లలో డెడ్ స్టోరేజీలో ఉన్నా రెండో పంటకు నీరిచ్చారని గుర్తు చేశారు. బంటుమిల్లి మెయిన్ కెనాల్ పరిధిలో దాదాపు 20 వేల ఎకరాల్లో దాళ్వా సాగు చేస్తారని, అందుకు సుమారు 6 టీఎంసీల నీరు సరిపోతుందని నాయకులు వినతి పత్రంలో పేర్కొన్నారు. దాళ్వాకు నీరిస్తే భూములను కాపాడటంతోపాటు రైతులకు ఆర్థిక అండ లభిస్తుందని నాయకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ జిల్లా కార్యదర్శి గొరిశెట్టి నాగేశ్వరరావు, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు సుజ్ఞానం జనార్ధన్‌రావు, వి.సురేష్, బి.నాగరాజు, పి.నరసింహారావు బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ప్రతిభా పోటీలకు విశేష స్పందన

మచిలీపట్నంటౌన్: స్థానిక రుస్తుంబాద మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన పలు ప్రతిభా పోటీలకు మంచి స్పందన లభించింది. కృష్ణా జిల్లాలోని అన్ని యాజమాన్యాలు నిర్వహిస్తున్న పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠశాల స్థాయి, మండల స్థాయిలో ఇటీవల పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వం, డిబేటింగ్, దేశభక్తి గీతాలు, క్విజ్ పోటీలలో మండల స్థాయిలో మొదటి స్థానం సాధించిన విద్యార్థులకు శుక్రవారం జిల్లా స్థాయి పోటీలను మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు లాంఛనంగా ప్రారంభించారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిబంధనల ప్రకారం జీవనం కొనసాగించడం, రాజ్యాంగ విలువలను తెలియజేశారు. జిల్లాలోని అన్ని ప్రాంతాలకు చెందిన పలు పాఠశాలల నుంచి దాదాపు 150 మంది విద్యార్థినీవిద్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యారు. విజేతలను ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా సైన్స్ అధికారి మోహమ్మద్ జాకీర్ అహ్మద్ పర్యవేక్షించారు. 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులతో ఈ కార్యక్రమం నిర్వహించారు.

సీపీఎం నిరసన



మచిలీపట్నంటౌన్: ముడుపుల అవినీతికి పాల్పడిన వ్యాపారవేత్త గౌతం అదానిని వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి స్థానిక కోనేరుసెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్రమోడీకి అత్యంత సన్నిహితుడైన అదాని అంతర్జాతీయ స్థాయిలో అవినీతికి పాల్పడ్డాడని ఆయన్ను వెంటనే అరెస్టు చేయాలన్నారు. అదాని గ్రూప్ అవకతవకలన్నింటిపై స్వతంత్ర సంస్థతో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం, జిల్లా కమిటీ సభ్యుడు సీహెచ్ రాజేష్, చంద్రపాల్, జయరావు, సత్యన్నారాయణ, రామారావు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలకు సిద్ధమవుతున్న రైతులు



పెడన మండలం నందిగామ సమీపంలో మినుము విత్తనాలు జల్లుతున్న రైతు

పెడన: దాళ్వాకు సాగునీరు ఇచ్చేది లేదని ఎన్డీయే కూటమి ప్రభుత్వం స్పష్టం చేయడంతో రైతులు ఆరుతడి పంటలు వేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. వరిపంట కోతకు ముందే ఆరుతడి విత్తనాలు జల్లుకోవాల్సి ఉండగా దాళ్వాకు సాగునీరు విడుదల విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన వచ్చే వరకు రైతులు ఎదురు చూశారు. ఇటీవల ప్రభుత్వాధికారులు దాళ్వాకు సాగునీరు ఇచ్చే పరిస్థితి లేదని స్పష్టం చేయడంతో ఇప్పటికే వరికోతలు కోసేసిన రైతులు తమ పంట పొలాలను దుక్కిదున్ని చదును చేసుకుంటున్నారు. మరి కొందరు దుక్కిదున్నిన చోట విత్తనాలు జల్లుకుంటున్నారు. విత్తనాలు కోనుగోలు చేయడం రైతులకు తలకుమించిన భారం అవుతోంది. పంట పండించి క్వింటా మినుము అమ్మితే రూ.7 వేల నుంచి రూ.8 వేలు వస్తున్నాయని, అదే విత్తనాలు జల్లుకోవడానికి క్వింటా మినుములు కొనుగోలుకు రూ.9 వేల నుంచి రూ.10 వేలు పెట్టుబడి పెట్టాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫార్మసీ విద్యార్థుల ర్యాలీ



ఫార్మసీ వారోత్సవాల ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల విద్యార్థులు జాతీయ ఫార్మసీ వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని రిజిస్ట్రార్ ఆచార్య కె.శోభన్ బాబు విద్యార్థుల ర్యాలీని ప్రారంభించారు. పజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా విద్యార్థులు సేవా భావం కలిగి ఉండాలని పేర్కొన్నారు. అనంతరం సీజనల్ వ్యాధులు, మందుల వినియోగంపై శారదానగర్‌లో ప్రజలకు విద్యార్థులు అవగాహన కల్పించారు. ఆయా సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు, ఆచార్య ఎంవీ బసవేశ్వరరావు ఆచార్య మారుతి, సహాయ ఆచార్యులు సుజాత, శాంతి కృపా, అమల, విష్ణు, హనుమంతరావు, శిరీష, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ వైద్యురాలు లక్ష్మీకమల మృతి



చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లికి చెందిన సీనియర్ వైద్యురాలు డాక్టర్ పింగళి లక్ష్మీకమల (75) శుక్రవారం మృతి చెందారు. వైద్య రంగంలో పేరుపొందిన ప్రముఖ సీనియర్ వైద్యులు చల్లపల్లికి చెందిన డాక్టర్ పింగళి మధుసూదనరావు సతీమణి డాక్టర్ లక్ష్మీకమల విజయవాడలో గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఆమె అంత్యక్రియలు శనివారం ఉదయం చల్లపల్లిలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. డాక్టర్ లక్ష్మీకమల మృతి పట్ల ప్రజా ప్రతినిధులు, డాక్టర్లు, ప్రముఖులు సంతాపం తెలిపారు.